## నవ్విపోదురు కాక నాకేటి

**- రాజకీయ నాయకులను మించిపోతున్న జర్నలిస్ట్ సంఘ నాయకులు**

**గెలుపు కోసం ఏకంగా నకిలీ జర్నలిస్ట్ ల లిస్ట్ తయారీ**




**తొలిసమయం, కొత్తగూడెం, మే 21 :**
ఐజేయు జిల్లా అధ్యక్ష పదవి కోసం రానున్న మహాసభ వేదికగా ఓటింగ్ జరిగితే తమకు అనుకూలంగా ఉండే వారిని దొడ్డి దారిలో జర్నలిస్ట్ ముసుగు వేసి తీసుకుని వచ్చేందుకు కొందరు జర్నలిస్ట్ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు చూస్తుంటే ప్రతిఒక్క పాత్రికేయ మిత్రుడు నవ్వుకుంటున్నారు. టీయూడబ్ల్యూజే ఐజేయు యూనియన్ లో సభ్యత్వం పొందడం ఇంత తేలికైన పనా అంటూ దినపత్రిక యాజమాన్యాలు సైతం ముక్కున వేలేసుకుంటున్నాయి. మీ యూనియన్ లో ఉన్న వ్యక్తి అసలు మా పేపర్ లో పని చేయడం లేదు మొర్రో అని పేపర్ యాజమాన్యం నెత్తి నోరు బాదుకునే పరిస్థితి ఉందంటే ఆ యూనియన్ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అసలు ఇలా దొంగ ఓటర్లను తయారు చేసుకొని నేను నాయకుడినే అని గొప్పలు చెప్పుకునే నేతల మనోధైర్యం ఎంతైనా మెచ్చుకుని తీరాల్సిందే. అసలు ఇలాంటి నకిలీ ఓటు సంస్కృతిని జర్నలిస్ట్ యూనియన్ లోకి తీసుకుని వచ్చి గెలిస్తే అది గెలుపేనా? అన్నది అలోచించి చూసుకోవాలి... దొంగల్ల కాదు నాయకుడిలా వచ్చి నిలబడి జర్నలిస్ట్ లకు రాబోయే రోజుల్లో ఎం చేయగలవొ చెప్పి బరిలో నిలబడి పోరాటం చేయాల్సిన నాయకులు ఇలా తెరవెనుక వెన్నుపోటు రాజకీయాలు చేస్తుంటే ఇన్నాళ్లు అవసరం కోసం పూటకో మాట మాట్లాడే రాజకీయ నాయకులు తెల్ల మొహం వేసుకుని చూస్తున్న పరిస్థితి నెలకొంది...

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**తొలి సమయం, బయ్యారం;మే, 21:**
మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బయ్యారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బయ్యారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యం వహించగా, బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, జెగ్గుతండా సర్పంచ్ జయంతి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేసిన మహానేత అని కొనియాడారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఆలోచన వంటి సంస్కరణలు ఆయన దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన రైతు ధాన్యం కొత్తగూడ మండలంలో విషాదం



**తొలి సమయం కొత్తగూడ 21 మే 2026**
కొత్తగూడ మండలంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని తాటివారి వేంపల్లి ప్రధాన రహదారిపై రైతు తాటి రుద్ర వర్మ ఆరబోసిన వరి ధాన్యం అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిబూడిదైంది. సమీప అడవిలో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు వేగంగా వ్యాపించి రహదారి పక్కన ఆరబోసిన ధాన్యానికి అంటుకున్నాయి. దీంతో కొద్దిసేపటికే మంటలు తీవ్రరూపం దాల్చి భారీగా నిల్వ ఉంచిన ధాన్యం దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే పెద్ద మొత్తంలో నష్టం జరిగినట్లు సమాచారం. ఈ అగ్నిప్రమాదంలో రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. కష్టపడి పండించిన పంట కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఘటన సమాచారం అందుకున్న స్థానికులు, రైతులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వేసవి ఎండల తీవ్రత కారణంగా అడవుల్లో తరచూ మంటలు చెలరేగుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. రహదారుల పక్కన ధాన్యం ఆరబోసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

## రైతు సమస్యలు వెంటనే పరిష్కరించాలి : బీజేపీ నాయకులు

**తొలి సమయం,ఇల్లందు;మే 21:**
రాష్ట్రంలోని ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇల్లందు బీజేపీ పట్టణ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్‌కు గురువారం మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలు సరిపడా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'తరుగు, తేమ' పేర్లతో కొందరు దళారులు రైతులను దోచుకుంటున్నారని ఆరోపిస్తూ, అలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరగేలా చూడాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో



ఇల్లందు పట్టణ అధ్యక్షురాలు సుచిత్ర పాసి, మండల అధ్యక్షుడు బట్టు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలగాని గోపికృష్ణ, రాష్ట్ర సీనియర్ నాయకుడు మావునూరి మాధవ్, నాయకులు రాజకుమార్ పాసి, శివకుమార్ కండెల్వాల్, సుమలత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య శ్రీకారం



**తొలి సమయం, ఇల్లందు;మే, 21:**
పర్యటనలో భాగంగా సుదిమళ్ల గ్రామంలో రూ.1 కోటి వ్యయంతో గ్రామ శివారు నుంచి పంట పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ కొత్తగుంపులో మహిళా స్వయం సహాయక సంఘాల కోసం రూ.30 లక్షలతో నిర్మించనున్న స్త్రీశక్తి భవనానికి భూమిపూజ నిర్వహించారు. అలాగే ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో రూ.20 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, మామిడి గుండాల గ్రామపంచాయతీ పరిధిలోని సువర్ణపురంలో రూ.6 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మెడికుంట గ్రామంలో రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మండల రాంమహేష్, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, పురపాలక వైస్ చైర్మన్ పెండేల రాజు, దిశ కమిటీ సభ్యురాలు బానోత్ శారద, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుడు బైరెడ్డి నారాయణరెడ్డి మృతి

**- పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే**

**కోరం కనకయ్య, మల్లిబాబు యాదవ్**

**తొలి సమయం కామేపల్లి;మే, 21:**
కామేపల్లి మండలం కొత్త లింగాల గ్రామానికి చెందిన దేశ స్వాతంత్ర సమరయోధుడు బైరెడ్డి నారాయణరెడ్డి (98) వృద్ధాప్య అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తదితరులు వారి నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. బైరెడ్డి నారాయణరెడ్డి చేసిన సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశం ఒక గొప్ప స్వాతంత్ర సమరయోధుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ



సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ పతే మహ్మద్, టీపీసీసీ సభ్యుడు పుచ్చకాయల వీరభద్రం, ఏపూరి మహేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, తోటకూరి శివయ్య, ఎడ్లపల్లి శేషగిరిరావు, రాయల ఉపేందర్, కోటి, కొత్త లింగాల గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తి వరంగల్ డీసీసీ అధ్యక్షులు మహ్మద్ అయూబ్

**తొలి సమయం కొత్తగూడ 21 మే 2026**
మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి వర్ధంతి సందర్భంగా వరంగల్ నగరంలోని ఎంజీఎం సర్కిల్ వద్ద వరంగల్ డీసీసీ అధ్యక్షులు మహ్మద్ అయూబ్ గారు ఘనంగా నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మహ్మద్ అయూబ్ మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసిన దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశంలో సమాచార సాంకేతిక రంగానికి ఊపిరి పోసి, యువతకు కొత్త అవకాశాల ద్వారాలు తెరిచిన మహానేతగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువత సాధికారత, సాంకేతిక విప్లవం వంటి అనేక రంగాల్లో రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రగతికి బాటలు వేసాయని అన్నారు. దేశ సమగ్రత, జాతీయ ఐక్యత కోసం ఆయన చేసిన కృషి అమూల్యమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజీవ్ గాంధీ పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాలని ప్రోత్సహించి, దేశ భవిష్యత్తు యువశక్తి చేతుల్లోనే ఉందని



నమ్మిన నాయకుడు రాజీవ్ గాంధీ అని గుర్తుచేశారు. అంతేకాకుండా ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలు శాంతి, సామరస్య భావాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహానేతలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగ ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం మొత్తం భావోద్వేగ వాతావరణంలో కొనసాగింది

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



**తొలి సమయం, ఇల్లందు;మే, 21:**
ఇల్లందులో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళుల కార్యక్రమాలు నిర్వహించారు. ఇల్లందు ఎమ్మెల్యే కార్యాలయం మరియు జగదాంబ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య రాజీవ్ గాంధీ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ దేశ అభివృద్ధి, టెలికాం రంగ విస్తరణ, విద్యా వ్యవస్థ బలోపేతంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి దేశానికి ఆదర్శమని కొనియాడారు. రాజీవ్ గాంధీ ఆశయాలతోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక చైర్మన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురుమయ్య



**తొలి సమయం శ్రీరంగాపూర్ మే 21**
జిల్లా కలెక్టర్ మరియు జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో శ్రీరంగాపూర్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం ను వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం కురుమయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారుల ఉద్దేశించి మాట్లాడుతూ నిరంతర సాధన చేయాలని అప్పుడే కబడ్డీ క్రీడలో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని సూచించారు. ఉన్నత పాఠశాల ఆవరణంలో కబడ్డీ కోర్టు ఏర్పాటు చేసుకొని గ్రామస్తుల సహకారంతో లైటింగ్ ఏర్పాటు చేసుకొని కబడ్డీ ని ప్రాక్టీస్ చేస్తున్నటువంటి క్రీడాకారులను చూస్తే చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక చొరవ తీసుకొని వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నటు వంటి కబడ్డీ క్రీడాకారుడు ప్రవీణ్ కుమార్ ని అభినందించారు.

## జర్నలిస్ట్ మడ్డి వీరన్న తండ్రిని పరామర్శించిన టియుడబ్ల్యూజే నాయకులు



**తొలి సమయం కొత్తగూడ 21 మే 2026**
మహబూబాబాద్ పట్టణంలోని ధరణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్ట్ మడ్డి వీరన్న తండ్రి చంద్రయ్యను టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి ఆసుపత్రికి చేరుకుని చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జర్నలిస్ట్ మడ్డి వీరన్నతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని, చంద్రయ్య త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు, స్నేహితులు కూడా కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపారు.

# ఉపాధి హామీ పనుల్లో అక్రమాల ఆరోపణలు

**పర్యవేక్షణ లోపంతో నామమాత్రపు పనులు**

**ఎండల్లో అవస్థలు పడుతున్న కూలీలు**

**పనులు చేయకుండానే నీకింత నాకింత**

**అధికారులు, కూలీలు కుమ్మక్కు**

**తొలి సమయం కొత్తగూడ 21 మే 2026**
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల్లో తీవ్ర అవకతవకలు చోటుచేసుకుంటున్నా యనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించి వలసలను నివారించాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయిలో మాత్రం నిర్వీర్యమవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండుతున్న ఎండల కారణంగా పనులకు హాజరవుతున్న కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో కూలీలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎండల తీవ్రతను తట్టుకోలేక చాలామంది కూలీలు సమయం పూర్తికాకముందే పనులు ముగించుకుని వెళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. ఇక పనులను పర్యవేక్షించాల్సిన ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో కనిపించకుండా, మేట్‌ల ద్వారానే పనులు నడిపిస్తున్నారనే



విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు కార్యాలయాలకే పరిమితమై నామమాత్రపు పర్యవేక్షణతో సరిపెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, కొన్నిచోట్ల కూలీలు పనులు చేయకుండానే కేటాయించిన పని ప్రదేశాలకు వెళ్లి ఫోటోలు దిగుతున్నారని, అనంతరం అధికారులు కూలీలు కుమ్మక్కై ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పని జరిగినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి బిల్లులు పొందుతున్నారనే విమర్శలు గ్రామస్థుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించిన గ్రామసభలు కూడా



ప్రజలకు సమాచారం ఇవ్వకుండా నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సామాజిక తనిఖీల సమయంలో మాత్రమే పనులు సక్రమంగా జరుగుతున్నట్లుగా చూపిస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఉపాధి హామీ పథకం లక్ష్యాలు నీరుగారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే దృష్టిసారించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.